రెండు బైకుల ఢీ..ఇద్దరికి గాయాలు


గాయపడిన బ్రహ్మయ్య

పెద్దారవీడు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం పెద్దారవీడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దోర్నాల పట్టణానికి చెందిన కోటపాటి బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై మార్కాపురం వైపు వెళ్తున్నాడు. మార్కాపురం నుంచి పెద్దారవీడు చెంచుగూడేనికి మండ్లా చిన్నగురవయ్య ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పెద్దారవీడు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే రెండు ద్విచక వాహనాలు ఢీకొట్టుకోవడంతో కోటపాటి బ్రహ్మయ్య, చిన్నగురవయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులను మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానికులు మాట్లాడుతూ ఆర్అండ్బీ అధికారులు నూతనంగా రహదారి నిర్మించారని, స్పీడ్ బ్రేకర్లు వేయక పోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

CHANGE OF NAME

I, **Gosu Sankara Swami** (Old name) **S/o Venkateswarlu** Residing at H.No: 6-99C, Tarlupadu village and mandal, Prakasam dist, Andhra Pradesh, India, PIN-523332., have changed my name to **SHANKAR GOSU.** Hereafter my name is known as **SHANKAR GOSU** for all future purposes.













ఐసీడీఎస్ పనితీరుపై ఎంపీపీ ఆగ్రహం


ఐసీడీఎస్ సూపర్వైజర్లను ప్రశ్నిస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ను అటకెక్కించారని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్పై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పద్ధతి లేకుండా ఒక సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను వేరే సెక్టార్లో ఎందుకు కలిపారని ఐసీడీఎస్ సూపర్వైజర్లను ఎంపీపీ ప్రశ్నించారు. మోక్షగుండం సెక్టార్ను 30 కిలోమీటర్ల దూరంలోని గలిజేరుగుళ్ల సెక్టార్లో కలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోక్షగుండం పక్కనే ఉన్న పందిళ్లపల్లె, పూసలపాడులో కలపకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రీస్కూల్ విద్య, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం పౌష్టికాహారం అందిస్తుంటే సక్రమంగా అమలు జరగడం లేదని పలువురు ఎంపీటీసీ, సర్పంచ్లు సభలో తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉండాల్సిన పౌష్టికాహారం కేంద్రాల్లో ఉంచకుండా కార్యకర్తల గృహాల్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు స్వగ్రామంలో ఉండకుండా బేస్తవారిపేట, కంభంలో నివాసం ఉన్నట్లు గుర్తించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతుందని, సూపర్వైజర్లు ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. పిల్లలకు ఆకుకూరలు పెట్టడం లేదని, నెలలో ఎన్ని రోజులు సెంటర్లను తనిఖీ చేస్తున్నారనే వివరాలు కోరారు. సరైన సమాధానం చెప్పక పోవడంతో నెల రోజుల తర్వాత జరిగే సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని, అంగన్వాడీ సెంటర్ల పనితీరు మారాలని, సూపర్వైజర్లు తనిఖీలు చేయాలని, సెంటర్లకు స్టాక్ వచ్చినప్పుడు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ సూచించారు. మండలంలోని కోనపల్లె, శింగసానిపల్లె, పెద్ద ఓబినేనిపల్లె, గొట్టమిండ్ల గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు రూ.46 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తేనె బంకను నివారించాలి

తాళ్లూరు (ముండ్లమూరు): సజ్జ పంట సాగుచేసిన రైతులు తక్షణమే తేనె బంక నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని నాగంబొట్లపాలెంలో బుధవారం సజ్జపైరును పరిశీలించి మాట్లాడారు.







పెరటికోళ్ల పెంపకంతో లాభాలు


కోళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

దర్శి: పెరటికోళ్ల పెంపకంపై అవగాహనతో అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వీవీఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. షెడ్యూల్ కులాలు ఉపప్రణాళిక కింద రైతులకు కోళ్ల పెంపకంపై బుధవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు ఆర్థికంగా ఎదగడానికి చేయూతనిచ్చే ఉద్దేశంతో రైతులకు పెరటికోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం పెరటికోళ్లను పరిశీలించారు. పశువైద్యురాలు డాక్టర్ లీలాకృష్ణ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలు ఆదర్శంగా ఉండాలి


కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్

కొనకనమిట్ల: అంగన్వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ పేర్కొన్నారు. బుధవారం కొనకనమిట్ల ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీఓ సుధామారుతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం పలువురు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కూడిన పదార్థాలు అందజేశారు. నాగంపల్లిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ టి.పెదవెంకటరెడ్డి, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలు వెళ్లి పింఛను అందజేత


ఒంగోలులో పింఛను అందజేస్తున్న వలంటీర్ గురవయ్య

తర్లుపాడు: మండలంలోని పోతలపాడుకు చెందిన రాచీటి సుదర్శనం సుగర్ వ్యాధితో విజయవాడలో చికిత్స పొంది ఒంగోలులోని కుమారుడి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆపరేషన్ కారణంగా కాలికి రెండు వేళ్లు తొలగించడంతో నడవలేని పరిస్థితుల్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న క్లస్టర్ వలంటీర్ జమ్మలమూడి గురవయ్య బుధవారం ఒంగోలుకు వెళ్లి పింఛను అందజేయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ను సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సుధాకర్, ఎంపీడీఓ నరసింహులు అభినందించారు.

సొసైటీలకు కొత్త అధ్యక్షుల నియామకం

కురిచేడు: మండలంలోని మూడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నూతన అధ్యక్షులను నియమించారు. కురిచేడు సొసైటీ అధ్యక్షునిగా పోతిరెడ్డి నాగిరెడ్డి, సభ్యులుగా పత్తి పెద్ద సుబ్బయ్య, బొందలపాటి దానం, నమశ్శివాయపురం సొసైటీ అధ్యక్షునిగా ఆరే శ్రీనివాసరావు, సభ్యులుగా గాలి చిన్న కోటేశ్వరరావు, కేసనపల్లి యలమంద, పడమర వీరాయపాలెం సొసైటీ అధ్యక్షునిగా మానం కోటయ్య, సభ్యులుగా కామిశెట్టి చిన్న కోటేశ్వరరావు, దేవండ్ల కోటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతల ఏర్పాటు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీపీవో నారాయణరెడ్డి

ముండ్లమూరు: గ్రామాల్లోని ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత తీసుకోవాలని డీపీవో నారాయణ రెడ్డి సూచించారు. మండలంలోని శంకరాపురం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. అనంతరం స్వామిత్ర యాప్ సర్వేను పరిశీలించారు.

నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడిగా యలమందారెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షునిగా తూర్పుగంగవరం గ్రామానికి చెందిన యాడిక యలమందారెడ్డి నియమితులయ్యారు. బుధవారం దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కాపురం డివిజన్ హౌసింగ్ ఈఈగా పవన్కుమార్

మార్కాపురం: మార్కాపురం డివిజన్ గృహ నిర్మాణ శాఖ ఇన్చార్జి ఈఈగా పవన్కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన వెంకటస్వామి ఇటీవలే పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డీఈ పవన్కుమార్ ఇన్చార్జి ఈఈగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్లో జగనన్న ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతం చేస్తామని ఆయన తెలిపారు.

మణిపూర్ ఘటనపై బీసీ సంఘాల ధర్నా

గిద్దలూరు రూరల్: మణిపూర్ ఘటనపై బీసీ నాయకుడు కంచర్ల కోటయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మణిపూర్లో జరిగిన దురాచారాలపై ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. విశ్వబ్రాహ్మణుల సంఘ నాయకుడు కాయల కోటి లింగాచారి, శాలివాహన సంఘ నాయకుడు అద్దంకి మధుసూదన్రావు, నాయిబ్రాహ్మణ సంఘ నాయకుడు తొండమల్లు బ్రహ్మయ్య, ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెంచికలపాడులో పీర్ల నిమజ్జనం

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడులో బుధవారం పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు డప్పు, వాయిద్యాలతో గ్రామంలోని పుర వీధుల్లో గ్రామోత్సవం చేశారు. భక్తులు పీర్లకు నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం చివర చెరువు వద్దకు ఊరేగింపుగా తరలి వెళ్లి నిమజ్జనం జరిపించారు.









